


# మహానటి

బి.వి. రమణారావు

*జరిగిన కథ :*

ఇటీవల సినీజనులకు మనుషుల నటన కంటే కుక్కలు, గుర్రాలు, పొట్టేళ్ళు, ఏనుగులు, పాములు నటనే నచ్చడం కళ్ళారా చూసి చెవులారా విన్న ఫిల్మ్ ప్రొడ్యూసర్ శివరామ్ 'అడివిమనిషి' కథ సినిమా తీసెయ్యాలని వొట్టెట్టుకున్నాడు. ప్రఖ్యాత నటీమణి జయప్రియనీ, కొత్తనటుడు నూతన్ రామారావుని బుక్‌చేశాడు. కథా కమామీషు పాటలు మాటలు అన్నీ సిద్ధంచేసుకుని మంచి ముహూర్తం చూసుకుని క్లాప్ కొట్టాలనుకునే సమయానికి చెంచు రాముడు రిలీజయింది. సంచులు సంచులు పోగుచేసుకుంది. ప్రొడ్యూసర్‌గారికి కలలో కనబడ్డ సీనులన్నీ అందులోనే వున్నాయి. పైగా కొత్త జంతువులేమీ మిగల్చకుండా ఎనభైనాలుగు లక్షల జీవరాసుల్నీ వాడేసేడు. దాంతో వొట్టు గట్టునపెట్టి 'స్వయంవరం' అనే జానపదాన్ని వరించేడు. అంచేత డైరెక్టర్నీ డైలాగుల్నీ మార్చవల్సొచ్చింది. ఇక చదవండి.]

కావేరి మంచి రైటర్. మంచి చురుకైనవాడు కాని అతని అదృష్టం బద్ధకించింది. జాతకరీత్యా లగ్నాధిపతయిన శని ఉచ్ఛస్థానంలోనూ భాగ్యాధిపతయిన బుధుడు నీచంలోనూ వుండీ తృతీయ స్థానంలో రాజ్యాధిపతయిన రవి శనిని క్రీగంట వీక్షిస్తూండటంవల్ల, శని స్థానభ్రష్టుడై బృహస్పతి అస్థానాన్నధిష్ఠించే వరకూ తనకి సినీప్రవేశం లేదని రూఢి చేసుకున్నాడు. సినీదర్శకుడు సుదర్శన్‌తో పరిచయమవ్వడం, కించిత్ సుదర్శనంతో ప్రసన్నుడవ్వడంతో తను జాతకంలో ఎదురుచూసిన ఘడియలు ప్రవేశించేయని గ్రహించేడు. ఆ క్షణం నుంచీ అతని మొహంలో సినీకళ తాండవించింది.

జానపద చిత్రాలకి మేటి అనిపించుకున్న సుదర్శనాన్ని శివరామ్ దర్శించి కథ విన్నవించేడు. ఆయన మెచ్చి అభయమిచ్చేడు.

"ఆ కథ రాసిన ఆంజనేయులుగారే మాటలుకూడా రాస్తానన్నాడు. సరి సరే నన్నాను." అన్నాడు శివరాం.

"ఆంజనేయులు రాస్తే లంకాదహనమే...డైలాగులు కావేరిచేత రాయిద్దాం." అన్నాడు సుదర్శన్.

"రచయిత్రి వొద్దుసార్. నా మాటని రచయిత్రుణ్ణే పెట్టుకుందాం."

"కావేరి మొగాడు. మాటలు రాయడంలో మొనగాడు."

"సరే అలాగే కానివ్వండి." అని నసిగేడు శివరాం.

"అనూతన్ రామారావు అడివిమనిషికి పనికొస్తాడు కాని స్వయంవరానికి పనికి రాడయ్యా."

"బాబ్బాబు ఆ మాటనొద్దు. హీరో పాత్రిస్తే పాతికవే లెదురిస్తానన్నాడు. జయప్రియకూడా ఒప్పుకుంది."

"వాడికి హీరోపాత్ర యిస్తే మీ చేతికొచ్చేదీ అదే. వాణ్ణి విలన్‌కింద వేసుకుందాం."

"సరే చెప్పిచూస్తాను. మరి మీ రెవర్నెట్టమంటారు?"

"అదంతా నా కొదిలెయ్యండి. డబ్బు ఖర్చులేకుండా చాకులాంటి కుర్రాణ్ణి చూస్తాను. మరి హీరోయిన్?"

"చెప్పేనుకదండీ. జయప్రియ బుకింగయిపోయింది."

"ఇదేమీ 'అడివిమనిషి' టయ్యా ఏనుగులమధ్య కనబడుతుంది కనక కాంట్రాస్ట్‌మీద కాస్త సన్నంగా కనబడుతుందనుకోడానికి. ఈవిణ్ణి పెట్టుకుంటే 'స్వయంవరా'నికి ఈవిడ సైజుకు తగ్గ రాజకుమారులు దొరకరు."

"అందుకే కదాండి నూతన్ రామారావు "

"ఆ విషయం సెటిలయిపోయింది. వాడు విలన్. అంతే."

"మరి ఆ అమ్మాయికి "

"అమ్మాయేమిటయ్యా! పాతికేళ్ళు బట్టి నటిస్తుంది. అసలు మీ ప్రొడ్యూసర్లు వూళ్ళో జరిగే పెళ్ళిళ్ళకెళ్ళరా? పెళ్ళికొడుకులూ పెళ్ళికూతుళ్ళూ యిలాగే ఉంటారుటయ్యా! పాప్యులర్ స్టార్స్ కావాలని మా ప్రాణాలు తీసి తాతయ్యల్నీ అమ్మమ్మల్నీ పెట్టి ఫిల్ములు తీయిస్తారు. అవిడొద్దులెండి. స్వర్ణలతని బంగారంలాంటి పద్దెనిమిదేళ్ళమ్మాయి. మొన్న కాలేజి డ్రామాలో ఏక్ట్ చెయ్యడం చూశాను. వండర్‌ఫుల్."

"అలా కుదరదండీ బాబూ! ఎగ్రిమెంటయిపోయింది. ఇప్పుడొద్దంటే లక్షరూపాయలు చెవులు మెలేసి వొసూలు చేస్తుంది."

"కాస్త కాళ్ళావేళ్ళాపడి ఎగ్రిమెంటు రద్దుచెయ్యమనండి. స్వర్ణలత జయప్రియలాగకాదు, అనర్గళంగా డైలాగులు చెబుతుంది, మంచి ఎక్స్‌ప్రెషన్, చక్కని గొంతు "

"బాబూ! నా గొంతుకొయ్యకండి.

కావాలంటే ఆ స్వర్ణలతకే చాన్సిద్దాం. జయప్రియంటే జనాలు పడిచస్తారు. పాతికేళబట్టి ఆ అమ్మాయినే చూడ్డాని కలవాటుపడ్డారు. లావెక్కిందో సన్న బడిందో ఆళ్ళకక్కర్లేదు. జయప్రియంటే జయప్రియే."

"మీరు మరో డైరెక్టర్ కోసం స్వయంవరం చాటించండి. ఆ విజ్ఞ చేతులమీద ఎత్తుకు పరిగెట్టే మొగాడు దొరకడు. దొరికినా అవిజ్ఞి వాణ్ణి కలిపి మొయ్యగల గుర్రం దొరకదు. తర్వాత మీ యిష్టం. ఇలా మీరు ప్రతిదానికీ అడ్డంపెడితే ఎలాగ. హీరోయిన్ విషయంలోమాత్రం స్వర్ణలత ఖాయం."

"ఏ విషయంలో మీరొప్పుకున్నారండీ? హీరో పనికిరాడన్నారు, హీరోయిన్ పనికిరాదంటున్నారు. డైలాగులు రాసే వోడూ పనికిరాడన్నారు."

"మీ మంచికోసమే చెబుతున్నాను. లేదా నా పరువూ మీ డబ్బూ గంగపాలు."

"మీతో మా గట్టి చిక్కేనండి."

"నాల్రోజుల్లో స్వర్ణలతని పిలిపిస్తాను. అసలు రాజకుమారి అంటే ఎలావుండాలో డైలాగులు ఎలా చెప్పాలో చూద్దురు గాని."

"రాజకుమారిని మీరు చూశారా నేను చూశానా? [illegible] సినీమా చూసేవాళ్ళకి రాజకుమారి జయప్రియ లాగుండదని ఎలా తెలుసు?"

"తెలియదు. తెలియజెప్పాలి. అదే మన ప్రతిభ. మీ రన్నింటికీ పేచీపెట్ట కండి. ఆవిడమాత్రం వొద్దు."


"ఆవిడతో చెప్పిచూస్తాను. కాని ఆ మాటలు తల్చుకుంటేనే గుండెలు దడదడలాడుతున్నాయండి. మీకేం! వొద్దని యిట్టేచెప్పేసేరు."

"నాచేయు పరువునష్టం, డబ్బు నష్టం దావాలికి మీరు సకుటుంబ బంధు మిత్ర సపరివారంగా చితికిపోతారని హెచ్చరించుచున్నాను. ఇవియే అనేక శాపనార్థములు. మంగళం మహత్ శ్రీశ్రీశ్రీ" అంటూ జయప్రియ పంపిన శుభలేఖను చేత్తోపట్టుకుని శివరాం కుర్చీలో కూలబడ్డాడు. దానికి సాయం ఓ గంటలో వస్తున్నానని ఫోన్ చేసింది. ఈ శుభ ముహూర్తానికే కావేరి డైలాగులు రాయడం స్వర్ణలత చదవడం టాలూకు ప్రదర్శనం సుదర్శన్ ఏర్పాటుచేశాడు.

"శివరాంగారూ! ఓ సారిలా వొస్తారా?" అంటూ ఆహ్వానించేడు సుదర్శన్.

"మరో గంటలో ఆవిడిక్కడికే సరాసరొస్తావుంటే నన్నీ అమ్మాయి బాగోతం చూడమంటావేంటయ్యా!" అంటూ ఏడుపుమొహం పెట్టేడు శివరాం.

"మరేం కంగారుపడకండి. ఆవిడా చీమూరక్తం వున్న మనిషేకదా! ఈ ఒక్క ఫిల్ములోనూ తప్పుకుని ఈ అమ్మాయికి అవకాశం యిమ్మని నచ్చ చెబుదాం. కోటి స్త్రీ ఉజ్వల భవిష్య




త్తులో చిచ్చుపెడుతుందా! ఈ స్వర్ణలతనే కాళ్ళావేళ్ళా పడమందాం." అన్నాడు కావేరి, శివరాంగారి భుజం తడుతూ.

"ఏమయ్యోయ్. నువ్వు కొ_త్త ̄- మూసుకుని, నువ్వూ ఆ అమ్మాయి పక్క గదిలో పొండి. ఆవిడొచ్చే శ్శ్', నే బతికుంటే నీ రాతలూ మాట వ సంగతాలోసిద్దాం" అన్నాడు శివరాం.

"ఎమిటండీ అలా బెంబేలు పడి పోతారు! ఫిల్మిండస్ట్రీ అన్న తర్వాత యిలాంటివి మామూలే. జయప్రియతో నేనూ చెప్పిచూస్తాను. నేను డైరెక్ట్ చేసిన రెండు పిక్చర్స్‌లో ఆవిడ ఏక్ట్ చేసింది." అన్నాడు సుదర్శన్ శివరాంకి ధైర్యం చెబుతూ.

"బాబూ మీ దిక్కుడే వుండండి. ఆవిడతో మీరే మాట్లాడం . నా కావి డంపేనే గుండెదడ. పైగా ఈ విడెళ్ళి ఆ డిస్ట్రిబ్యూషనోళ్ళకి ఫోన్‌చేసిందంటే పాత అప్పుల కాగితాలట్టుకొచ్చి నా మీద పడగవిప్పుతారు. ఆవిడ ఎక్స్‌ప్రెసనూ, డైలాగులూ బాగా పరిచ్చయెయ్యండి. ఆవిడకేమున్నాయో ఏంలేవో తెలుస్తాది" అన్నాడు శివరాం.

"సరే. అయితే మీరూరుకోండి. ఈ సీను నేను డైరెక్ట్ చేస్తాను." అన్నాడు సుదర్శన్, కావేరిని తీసుకుని లోపలి కెడుతూ.

కారు హారన్ వినేటప్పటికి శివరాంకి ముచ్చెమటలూ పోశాయి. సుదర్శన్ కూడా లోపల్నుంచి వచ్చి వరండామీద కెళ్ళేడు. డ్రయివర్ కారుదిగి తలుపు తియ్యగానే జయప్రియ ఠీవిగా కార్లోంచి దిగి, వరండాలో వున్న సుదర్శన్ని చూడనట్టు నటించి మెట్లెక్కి వరండాలో

కొచ్చేటప్పటికి "నమస్కారం" అన్నాడు సుదర్శన్.

"నమస్కారం. మీ ప్రొడ్యూసర్ గారున్నారా?" అంటూ భుజాన్ని వేళ్ళాడు తున్న వేనిటీబేగ్‌లోంచి రుమ్మాలు తీసుకుంటూ

"రాండి రాండి, దయచెయ్యండి. మీరొస్తారనే ఇలా కూనోండి."

"థేంక్స్. ఈ మర్యాదలకేంలెండి! నా నోటీసందిందికదా! మీ సమాధానం విందామనొచ్చేను."

"జయప్రియగారూ! మీరింత కోపంగా వుంటే ఆయనమాత్ర ఏం మాట్టాడగలడు? నెమ్మదిగా మాట్టాడుకుని వ్యవహారం పరిష్కరించుకుందాం. కొన్ని కారణాలవల్ల ఆయన ప్లాను మార్చుకోవల్సొచ్చింది. తీరిమార్చుని మీ మనస్సు నొప్పించడం ఆయనకి మాత్రం యిష్టమా చెప్పండి!" అన్నాడు సుదర్శన్.

"ఆయన యిష్టాయిష్టాలు నాకు తెలుసు. చెప్పుడు మాటలు విని తల కొరివితో గోక్కుంటున్నాడు." అంది జయప్రియ, బెల్లంకొట్టిన రాయిలా నోరు మూసుక్కూర్చున్న శివరాంకేసి కళ్ళల్లోంచి అగ్నికణాలు జిమ్ముతూ.

"మీ నోటీసొచ్చినప్పట్నుంచీ ఆయన గాభరాపడిపోతున్నాడు. మీరే స్వయంగా యిక్కడికొస్తున్నారని "

"సుదర్శన్‌గారూ! మీరు కొంచెం ఆయన్నే మాట్లాడనిస్తారా?" అంది జయప్రియ, ఇది నాకూ ఆయనకీ సంబంధించిన ఎగ్రిమెంటు వ్యవహారం అన్న ధోరణిలో.


"నే నెలాంటోణ్ణో మీకు తెలుసు. నేను పెట్టుబడి పెట్టేవోణ్ణి. డైరెక్టర్ని కాదు. కథ మారిందికనక హీరో హీరోయిన్లు మారాలని సుదర్శనంగారన్నారు. ఆ విషయమే మీతో "

"ఆ విషయమే అడుగుదామనొచ్చేను. ఎగ్రిమెంట్ మీద సంతకాలు పెట్టక ముందే మీరు డైరెక్టరుతో సంప్రదించాలి. లేదా ఎగ్రిమెంటయిన ఆర్టిస్టులతో ఫిల్ము తీయగల డైరెక్టర్నయినా చూసుకోవాలి. స్వయంవరం ఫిల్మ్ తీస్తున్నట్టూ దాంట్లో నేనే హీరోయిన్ననీ ఫ్రెష్‌గా ఎగ్రిమెంట్ రాయించుకుని పేపర్ పబ్లిసిటీ యిచ్చి యిప్పుడు మనస్సు మార్చుకున్నానంటే అర్థమేమిటి? నా పరువేమవుతుంది? ఇది మర్యాదస్తులు చేసేపనేనా! మీ కిష్టమైతే నటించడానికి అక్కర్లేదంటే పోడానికి నేనేమంత చాతకాన్ని దాన్ననుకున్నారా? అసలు మీరీ ఫిల్మెలాతీస్తారో నేనూ చూస్తాను" అంది

"నమస్కారమండీ" అంటూ సంభ్రమాశ్చర్యాలతో ప్రవేశించింది స్వర్ణలత, జయప్రియవైపు చేతులు జోడించి.

"నమస్కారం."

"మీరు జయప్రియగారు, అవునాండీ?" కళ్ళు పెద్దవిచేసి చిరునవ్వు చెరగకుండా




పెదిమల్ని అదుపులో పెట్టుకుని యింకా చేతులలాగే జోడించి వుంచింది స్వర్ణలత.

"అవును మీ రెవరు ?"

"నా పేరు స్వర్ణలత. నేను ఫిల్మ్ ఫేన్‌నండి. ఆంధ్రా యూనివర్సిటీలో 'మూసిన తలుపులు' డ్రామాలో రాధ పాత్ర వేసేను. ఫస్ట్ ప్రయిజొచ్చింది."

"సంతోషం. ఇక్కడకేం పనిమీ దొచ్చేరు ?" అంది అసలలాంటి యూని వర్సిటీ వున్నట్టూ, అలాంటి నాటకం వున్నట్టూ నమ్మకంలేనట్టు మొహంపెట్టి.

"మీరు స్వయంవరం ఫిల్మ్ తీస్తు న్నారు కదండీ. మీరందులో హీరో యిన్ రోల్ వేస్తానని ముందు ఒప్పుకుని, మళ్ళీ యిప్పుడు చాలా బిజీగావున్నాను వీల్లేదన్నారని చెప్పి "

"ఎవరు చెప్పేరలాగ ?"

"వీళ్ళే అన్నారండి. ఆ రోల్‌కి నేను పనికొస్తానేమో చూస్తామని నన్ను పిలి పించేరండి. అది మీరెయ్యతగ్గ పాత్ర. చాలా కష్టమైన పాత్ర. ఎంత మిమ్మల్ని యిమిటేట్ చేసినా ఆ రోల్ వెయ్యడానికి భయంగానే ఉందండి."

"నీ పేరేమిటన్నావు ?"

"స్వర్ణలత."

"చూడు స్వర్ణలతా ! ఈ నంగనాచి కబుర్లు నాదగ్గిర చెప్పకు. ఈ పాత్రకు నేను పనికిరానని నిన్ను సెలక్టు చేశారనీ నాకు తెలుసు. ఒకప్పుడు నేనూ నీకంటే నాజూగ్గా వుండేదాన్ని."

"క్షమించండి మీకూ నాకూ పోలి కేమిటి ! అప్పుడూ యిప్పుడూ అందచం దాల్లోనూ, నటనలోనూ, ఎక్స్‌ప్రెషన్ లోనూ మీకు మీరే సాటి. మీరు కాల

దన్నిన అవకాశం నాకు వరప్రసాద మైందనుకున్నాను కాని, మిమ్మల్ని కాదని నాకిచ్చేరని నాకు తెలీదు. ఏమండీ మీరిద్దరూ మాట్లాడరేం?"

"అఫ్‌కోర్స్. ఆ అమ్మాయి కలా చెప్పకపోతే ఎలా చెబుతాం. జయప్రియ గారు రిజెక్ట్‌చేసేరుకనక నిన్ను కన్సిడర్ చేస్తాం అన్నాను." అన్నాడు సుదర్శన్.

"ఆ అమ్మాయి చెబుతుందిగా! మళ్ళీ మీ సాక్ష్యం ఎందుకు!"

"అక్కా!" అంటూ జయప్రియ ముందు మోకరిల్లింది స్వర్ణలత,

"ఏంటొక్కా!"

"నా తప్పుంటే మీ యిష్టమొచ్చిన శిక్ష విధించండి. ఆ పాత్రకి మీకంటే నేను బాగా నప్పుతానని కలలో కూడా అనుకోను. నన్ను రమ్మండంలో యింత కుట్ర వుందని నాకు తెలీదు మీరు రాజ కుమారిగా వుంటే మీ పక్కన పరిచారిక వేషంలోవుండే అదృష్టం నాకు చాలు. అంతకంటే పెద్ద కోరిక నాకు లేదు. మీ ఆశ్రయం ఆదరణా నాకు కావాలి."

"కోరికలు మంచివే. కాని తప్పు త్రోవ తొక్కేవు."

"ఎంతో రిస్కుతీసుకుని యింట్లో చెప్పకుండా ఈ దుర్మార్గుల మాటలు నమ్మి వొచ్చేను. విధమూ చెడింది ఫలం దక్కలేదు. జీవితంలో నేను సినీమాల్లో నటించే అవకాశం దొరకపోవచ్చు. కాని మీ కిలాంటి ద్రోహం తలపెట్టే టంత నీచురాల్ని కాను. అక్కా! యిదిగో నీముందు ప్రమాణం చేస్తున్నాను. నాకీ పాత్ర వొద్దు. వీళ్ళసాయం వొద్దు. నన్ను క్షమించేనని ఒక్కమాట చెప్పండి చాలు. నేను వెళ్ళిపోతాను."

"అదేం ఖర్మ! చెట్టంత ప్రొడ్యూసరూ, కొండంత డైరెక్టరూ వుండగా నువ్వు పారిపోవడమెందుకు! నా కంటే అందమైనదానివి, నాకంటే చిన్నదానివి. ఈ ఫీల్డ్‌లో రాణించే క్వాలిఫికేషన్సన్నీ వున్నాయి నీకు."

"మీరు చెప్పినట్టే నేను మీలాగే గొప్పనటి నయ్యేననుకోండి. ఈ రోజున మీకు జరిగిన పరాభవమే రేపు నాకు మాత్రం జరగదా! నా వయస్సు అందం మాత్రం శాశ్వతమా! కొండంత ఆశతో వొచ్చేను. నువ్వీ పాత్రకు పనికిరావని వీళ్ళు చెప్పినా నేను బాధపడను. కాని మీ కాలిగోటికికూడా సాటిరాని నేను మీకు ద్రోహం చేస్తున్నానని మీరను కోడం నా దురదృష్టం. మీకు దగ్గరగా కూర్చుని మీతో మాట్లాడే అవకాశం, మీ ఆదరణ పొందే అదృష్టంకోసం ఎదురుచూశాను కాని నా వల్లనే మీకు అవమానం జరుగుతుందని నేనూహించ లేదు. వస్తాను."

సీను క్లయిమాక్స్ కొచ్చింది పర్యవసానం ఎలా వుంటుందో అని ఎదురు చూస్తున్న సుదర్శన్ జయప్రియ మొహంలో ఎక్స్‌ప్రెషన్ చూసి "ఆగు"

అని ఆమె అన్నతీరుచూసి స్థిమిత పడ్డారు.

"చూడండి జయప్రియగారూ! ఎంత మానాభిమానాలు వొదులుకున్నా, నా సహనానికికూడా హద్దుంది నేను క్షమాపణ చెప్పుకున్నకొద్దీ మీరు నోరు పారేసుకుంటున్నారు. నే నేంతప్పుచేశానని ఇటువంటి అవమానాన్ని భరించాలి!" అంది స్వర్ణలత. ఏంటీ క్లయిమేక్స్ ప్రారంభమైందని సుదర్శనం గ్రహించేడు.

"నిజంగా నన్నుకాదని నీకీపాత్ర యిస్తున్నారని నీకు తెలిదా?"

"తెలియదని చెప్పేను. మరి మిమ్మల్ని నమ్మించడం ఎలాగోకూడా నాకు తెలీయదు. ఇంతటి మహోన్నత తారాపథాన్ని మీరందుకున్నారు. కాని, నేలమీద వుండి ఆశానిరాశల మధ్య రెపరెపలాడే మావంటి చిన్నవాళ్ళ పట్ల చూపెట్టే మీ ఆదరణ విషయంలో మీరు పాతాళంలోకి దిగిపోతున్నారని ఈనాడు గ్రహించేను. చాలు ఈ అనుభవం. శలవు." అంది స్వర్ణలత, దుఃఖంతో గొంతు పూడుకుపోయిన స్వరంతో.

"స్వర్ణా ఆగు."

"ఆజ్ఞాపిస్తున్నారా?"

"లేదు. చెల్లెల్ని అర్థిస్తున్నాను."

"వెక్కిరిస్తున్నారా?"

"ఈ పాత్రకు నువ్వే సమర్థురాలివి. నాకు నీ వయస్సున్నప్పుడు, నా నోటి దగ్గర కూడు పడగొట్టుంటే, నీ అంత సమర్థతతో నటించి దక్కించుకునే తెలివితేటలు లేవు. నేను నీ లాగ బాగా చదువుకోలేదు, ఇలా మాట్లాడాలని తర్ఫీదిచ్చినవారూ లేరు. నీ మాటలు నిజమని నమ్మి నేను నీకు సాయంచెయ్యడంలేదు. అబద్ధమని తెలుసుండీకూడా నీకు సాయం చెయ్యడానికి కారణం ఒకటే. నువ్వు అప్పగించే డైలాగులు వెనకాల నీ భవిష్యత్తును గురించి నువ్వుపడే ఆవేదనని స్పష్టంగా నేనుచూడగలిగేను. చూడమ్మా! నటనలో నా కున్న అనుభవం నీకు లేదు. కాని ముందు ముందు బాగా రాణించే సూచనలున్నాయి. విష్ యూ ఆల్ ది బెస్ట్. మిస్టర్ శివరాం ఇదిగో మీ ఎగ్రిమెంట్" అంటూ అపనిమీద గిరాటెట్టి చరచర బయటికెళ్ళిపోయింది.

ఏమిటీ తమాషా! అని నిర్ఘాంతపోయేడు శివరాం. కావేరి చేతుల్లోవున్న డైలాగు కాగితాలు జారిపోయాయి. స్వర్ణలత అవాక్కయి తల దించుకుంది. మహానటి అనుకున్నాడు సుదర్శన్.